# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



### మళ్లీ ముప్పతిప్పలు పెడుతరు



ఆనాడు వచ్చిపోయే కరెంటుతో అన్నదమ్ముల పొత్తుల కరెంటుతో విభేదాలు వచ్చి పంచాయితీలు పెట్టుకునే స్థాయి ఉండేది. ముగ్గురు అన్నదమ్ములు ఉంటే మా వంతు వచ్చే వరకు ఉన్నమడి ఆరిపోయేది. వంతులవారీగా మోటరు పెట్టుకుంటే నాణ్యమైన కరెంటు రాకపోవడంతో అవి కాలిపోయి చాలా కష్టమయ్యేది. ఇప్పుడు ఆ కష్టాలు లేకుండా పోయినవి. పాత బోర్లతోనే ఉన్న పొలం పారుతుంది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతులకు 24గంటల కరెంటు ఇస్తుండడంతో వ్యవసాయం పండగలా మారింది. నిరంతరం విద్యుత్ రావడంతో పొత్తుల కరెంటు దగ్గర ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోయింది. ఆ కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదు. గానీ, మూడు గంటల కరెంటుతో మళ్లీ ముప్పుతిప్పలు పెట్టాలని చూస్తున్నరు. కేసీఆర్ సార్ పాలనలోనే రైతన్నలు సల్లంగా ఉంటరు. అందుకే మల్లా కేసీఆర్ సారు రావాలె.

**- ఎక్కల్‌దేవి కొమురయ్య, రైతు, హరిదాస్‌నగర్ (ఎల్లారెడ్డిపేట)**



### రెండు దొయ్యలు పారయ్..

కాంగ్రెసోల్లు చెప్పినట్లు మూడు గంటల కరెంటిస్తే రెండు దొయ్యలు గూడ నీల్లు పారయి. నాకు దుమాల శివార్ల చింతలకాడ నాలుగెకరాలు ఉంది. తొమ్మిదేండ్ల కింద 4, 5 బోర్లు ఏసిన నీల్లు పడలేదని ఇడిసిపెట్టిన. కాలమైతే పంటేసినం.. లేకపోతె ఇడిసిపెట్టినం. ఇప్పుడు చెరువులన్నీ మంచిగ జేసినంక భూగర్భ జలాలు గూడ పెరిగినయ్. ఇడిసిపెట్టిన రెండు బోర్లల్లకు కొన్ని నీల్లు వచ్చినయ్. రెండు బోర్లల్ల మోటర్లు పెట్టిన. ఇగో ఇవి గా నీల్లే. మా పక్కకే మల్కపేట గూడ అయితుంది. అదయితే ఇగ మాకు పుల్లు నీల్లు గూడ ఉంటయ్. ఇప్పుడు మా రెండు బోర్లళ్ల నీళ్లను నా నాలుగెకరాలకు పారియ్యాలంటే కనీసం ఎనిమిది గంటల కరెంటైన గావాలె. ఇగ మూడు గంటలని కాంగ్రెసోల్లు ఎట్ల చెప్పుతున్నరో తెల్వది.

**- పెంజర్ల నాగరాజు, రైతు, దుమాల (ఎల్లారెడ్డిపేట)**

# కాంగ్రెస్ పాలనే దరిద్రం

## నమ్మితే మళ్లీ పాత రోజులే

- 24గంటలు కరెంట్ తీసేస్తరు.. మూడు గంటలే ఇస్తరు
- అది ఎప్పడిస్తరో తెల్వదు
- 10 హెచ్‌పీ మోటర్లతో బతుకులు ఆగమే
- మోటర్లకు మీటర్లు పెడుతరు.. నిండా ముంచుతరు
- ఈ ఎన్నికల్లో ఆ పార్టీని తరిమికొడుతం
- స్పష్టం చేసిన జిల్లా రైతులు



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్‌ను నమ్మితే పదేండ్ల కిందటి పరిస్థితులు పనరావృతం అవుతాయని జిల్లా రైతులు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ వచ్చేదాక ఎసోంటి గోస పడ్డమో.. ఎన్ని కష్టాలు పడ్డమో ఆ భగవతునికే తెలుసని వాపోతున్నారు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదు గానీ, అన్నదాతలను ముంచే కుట్రలు చేస్తున్నారని మండిపడుతున్నారు. కాంగ్రెస్ నాయకులు వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలు అని చేస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. 24 గంటల కరెంట్ ఉన్న కాడ ఈ మాయమాటలేందని నిలదీస్తున్నారు. పైగా 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని ఉచిత సలహా ఇవ్వడంపై ఆగ్రహిస్తున్నారు. రెండు రోజుల క్రితమే ఆ పార్టీ అసలు రంగు బయటపడిందని, కేంద్రం మంత్రి నిర్మలా సీతారమన్ మాటలతో కాంగ్రెస్ మోటర్లకు మీటర్ల పెట్టే కుట్ర బట్టబయలైందని మండిపడుతున్నారు. వాళ్లను నమ్మితే మోటర్లకు మీటర్లు పెడుతరని, 24 గంటల కరెంట్ తీసేసి 3 గంటల ఇస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. నాడు వాళ్ల పాలనలో అరిగోస పడ్డామని, కరెంట్ ఎప్పుడొస్తుందో తెలియక రాత్రిళ్లు జాగారం చేశామని, కండ్ల ముందే పంటలు ఎండుతుంటే కన్నీళ్లు పెట్టుకున్నామని గుర్తు చేశారు. దొంగ రాత్రి కరెంట్ ఇచ్చి ఎందరో రైతుల ఉసురు పోసుకున్న ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు. కరెంట్ విషయంలో ఇటు బీజేపీ కూడా తెలంగాణ రైతులకు అన్యాయం చేసిందని ఆక్షేపిస్తున్నారు. కేసీఆర్ లేకుంటే తమ మోటర్లకు మీటర్లు పెట్టి బిల్లులు వసూలు చేసేవారని, కానీ, తన గొంతులో ప్రాణం ఉన్నంత వరకు మోటర్లకు మీటర్లు పెట్టనివ్వని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా రైతులు గుర్తు చేసుకుంటున్నారు. ఈ నెల 30న కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్‌ను మరోసారి సీఎంగా చేసుకుంటామని స్పష్టం చేస్తున్నారు.

### మళ్లీ కష్టాలు తెస్తరా?

కాంగ్రెస్ కాలంలో కరెంటుకు చాలా ఇబ్బందులుండేవి. పనులు వచ్చిన కరెంటు లేక డబ్బులు అంతంత మాత్రమే వచ్చేవి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత కరంటు కష్టాలు తొలిగినయి. వెల్డింగ్ పనులు వచ్చినా కరెంటు కోసం ఎదురు చూసేది. అద్దె కిరాయి కట్టడానికి ఇబ్బంది ఉండేది. నిత్యం త్రీ ఫేజ్ కరంటుతో పనులు బాగా చేసుకుంటున్నం. మళ్లీ కాంగ్రెసోళ్లు అప్పటి కష్టాలు తేవాలని చూస్తున్నరు. వాళ్లను నమ్మేది లేదు.

**- కుంబాల దుర్గారెడ్డి. వెల్డింగ్ షాప్ నిర్వాహకుడు (ముస్తాబాద్)**



### మోటర్లు కాలవెడుతరా?

నాకు రెండు ఎకరాల భూమి ఉంది. కాంగ్రెస్ కాలంలో కరెంటుకు చాలా ఇబ్బందులుండేవి. కరెంటు లేక పొలం ఎండేది. పెట్టుబడికి కూడా పైసలుండేటియి కాదు. కరెంటు సక్కగ రాక మోటర్లు కాలేటివి. చేయించుదామంటే పైసలుండేటియి కాదు. దీంతో సాగు సక్కగా సాగక పడావుండేది. కానీ, ఇప్పుడు నీళ్లకు ఇబ్బందులు లేవు. కరంటు కష్టాలు లేవు, సాగు మంచిగా సాగుతుంది. ఎరువులకు, విత్తనాలకు, దుక్కులు దున్నడానికి పెట్టుబడి కేసీఆర్ ఇత్తుండు. పైసలు సక్కగా బ్యాంకు ఖాతాలోకి వస్తున్నయి. మంచిగా ఎవుసం చేస్తున్నం. ఇప్పుడు మళ్లీ మూడు గంటలు చాలని కాంగ్రెసోళ్లు అంటున్నరు. 10 హెచ్‌పీ మోటర్ వాడాలంటున్నరు. గట్లయితే కరెంటు సాలక మోటర్లు కాలుతయ్.

**- ఎల్లవ్వ, మహిళా రైతు, తుర్కపల్లి (ముస్తాబాద్)**

### 10హెచ్‌పీల మోటరు పెడితే బోర్లుంటయా?



నాకు నాలుగున్నర ఎకరాల పొలం ఉంది. మానాయనతో కలిసి సాగు చేసుకుంటున్న. నాడు కరెంటు ఎట్లుండె. ఎట్టించ్చింద్రు. వచ్చిన కరెంటుతో నారు మడి కూడ తడవలేదు. కరెంటు రాగనే అందరు ఒకటే ఒత్తుడే. దాంతోటి మోటర్లు కాలిపోతే వచ్చిన పైసలు రిపేర్లకే కాలబెట్టినం. ఏసిన పంట చేతికి రాక పైసల్లేక అప్పుల పాలైనం. పదేండ్ల సంది కరెంటు 24గంటలు వత్తుంది. అప్పుడప్పుడూ ఏదైనా మరమ్మతులుంటే తప్ప కరెంటు పోతలేదు. ఇగ 10హెచ్‌పీల మోటరు పెట్టుకుంటే మూడు గంటల కరెంటు సాలనేటోళ్లకు గింత కూడ తెలువదా?. పెట్టుకున్న మోటరుకు ఎన్ని పైసలైతయ్. పైపులకు వైర్లు ఉటిగనే వత్తయా.? అంతపెద్ద మోటరు పెడితే బాయిలో నీళ్లుండద్దా. మాకేమైనా కాలువులు దవ్వించింద్రా... పైపులేసి పారించేందుకు. అధికారంలోకే రాలేదు గిన్నీ మాట్లాడుతున్న నాయకులకు ఎవుసం సంగతి ఏం తెలుసు. నాటి రోజులు మళ్ల రావద్దనే కోరుకుంటున్నం. నాడు అరిగోస పెట్టిన కాంగ్రెస్ మళ్లీ ఇప్పుడు మాయమాటలు చెబుతున్నది. అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదు కానీ, రైతులను ఆగం చేస్తున్నది. మోటర్లకు మీటర్లు పెట్టే కుట్ర చేస్తున్నరని ఇయ్యాలే తెలిసింది. బీజేపీ, కాంగ్రెస్ రైతులపై కుట్రలు చేస్తున్నయని ముందు నుంచి సీఎం కేసీఆర్ చెబుతనే ఉన్నడు. మాకిప్పుడే అర్థమైంది. కాంగ్రెస్, బీజేపీని ఇంక నమ్ముతమా..? తప్పిదారి ఓటేత్తే కచ్చితంగా మోటర్లకు మీటర్లు పెట్టి ఉచిత కరెంట్ లేకుండా చేస్తరు.

**- నలువాల నరేందర్‌రెడ్డి, రైతు, చీర్లవంచ, తంగళ్లపల్లి (రాజన్న సిరిసిల్ల)**

### సోయిలేని మాటలు మాట్లాడుతున్రు



మా గ్రామంలో 10 హెచ్‌పీ మోటర్లు ఏ రైతుకు లేదు. ఈ కాంగ్రెసోళ్లు 10 హెచ్‌పీ మోటర్లు రైతులు వాడాలనడం విడ్డూరంగా ఉంది. మూడు గంటల కరెంటు ఇస్తం, 10 హెచ్‌పీ మోటర్లు వాడాలంటూ సోయిలేని మాటలు మాట్లాడుతున్రు. వారికి ఎవుసంపై అవగాహన లేదని అర్థమైంది. ఏ రైతు కూడా 10 హెచ్‌పీ మోటరు వాడడు. ఉన్న బావుల్లో 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లనే ఉపయోగిస్తున్నరు. మూడు గుంటల కరెంట్‌తో ఎన్ని ఎకరాలు పారుతుంది. 24 గంటల కరెంటు ఉంటే రైతుకు లాభం జరుగుతుంది. ఈ మూడు గంటల కరెంటుతో రైతులకు ఏం జరుగుతుందో కాంగ్రెసోళ్లు చెప్పాలి.

**- గాలిపెల్లి రాజు, నమిలిగుండుపల్లి (వేములవాడ రూరల్ )**

### వాళ్లకు ఎద్దేరుకనా.. ఎవుసమెరుకనా?



నాడు రైతులకు తీరని అన్యాయం జరిగింది. తల్సుకుంటనే భయమైతది. తెలంగాణ వచ్చిన తర్వాతే మేం కోలుకున్నం. 24గంటల కరెంట్ అత్తంది. పుష్కలంగా నీళ్లున్నయి. ఏటా రెండు పంటలు పండించుకుంటున్నం. తెలంగాణ రాక ముందు రైతులను అరిగోస పెట్టిన కాంగ్రెసోళ్ల, మళ్ల ఇప్పుడు వస్తున్రు. అధికారంలోకి వచ్చేతందుకని ఏవేవో చెబుతున్రు. మంచిగున్న కరెంట్‌పై మాయమాటలు చెబుతున్రు. కరెంట్ మంచిగలేని మంచిగ చేత్తమని చెప్పలే గానీ, ఇక్కడెందుకు చెప్పుడు. అట్టిగ ఆగం చేసుడు తప్పితే గానీ రైతులకైతే ప్రయోజనం లేదు. పెద్ద మోటర్ పెడితే లక్ష యాభైవేలు అయితయట. నాలాంటి చిన్న సన్నకారు రైతులు ఎక్కన్నుంచి తెస్తరు? ఎవుసం చేసేటోళ్లకైతే మా బాధలు తెలుస్తయి. కాంగ్రెసోళ్లకు ఏం తెలుసు? ఎద్దేరుకనా.. ఎవుసమెరుకనా? అందుకే ఇష్టం వచ్చినట్టు మాట్లడుతున్నరు. రైతు బిడ్డ అయిన కేసీఆర్‌కు మా బాధలు తెలుసు కాబట్టే మాకు మంచి చేస్తున్నడు. అలాంటి సారు మళ్లీ రావాలి.

**-మరిగడ్డ నారాయణ, రైతు (రుద్రంగి)**

### ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయ్

కాంగ్రెసోళ్లు చెప్పినట్లు ఒకేసారి 10హెచ్‌పీ మోటర్లు చాల్ చేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు గడికి పాడవుతయి. లచ్చ రూపాయలు ఖర్చు పెట్టి 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవడం రైతులతో కాదు. అప్పట్లో రాత్రి, పగలు టైం పెట్టి కరెంట్ ఇచ్చేటోళ్లు. సగం పొలం పారకముందే కరెంట్ పోయేది. మళ్లీ వచ్చేదాకా ఎదురుచూసేటోళ్లం. దీంతో కరంటుపై బరువు పడదు. 24 గంటలు కరెంటు ఇస్తే కరెంటు పోయేది తెలుస్తా లేదు. ఒకసారి కాకుండా రైతులు ఎవరికీ వీలయినప్పుడు వాళ్లు పంటలకు నీళ్లు పారబెడుతున్నం. పొలాల దగ్గర పడుకునేది లేదు. వాళ్లు చెప్పినట్లు మూడు గంటల కరెంట్ ఇస్తే రైతులంతా ఆగమయితం. వ్యవసాయం బంజేసి కూలీ పనులకు వెళ్లే పరిస్థితులు వస్తయి.

**-లాకవత్ రాంచంద్, రంగంపేట (వీర్నపల్లి)**





### మూడు గంటల కరెంటుతో పొలం పారుతదా..?

నాకు నర్మాల శివారులో రెండెకరాల పొలం ఉంది. కాంగ్రెసోళ్ల హయాంలో కరెంట్ సరఫరా లేక గోసపడ్డ. రాత్రుల్లు పంటలకు సాగునీరు పెట్టడానికి వెళ్లి ప్రమాదాల పాలైనం. అప్పట్లో రాత్రుల్లు బాయిల కాడికి పోయి పురుగుపూసి సచ్చిపోయినోల్లు కూడా ఉన్నరు. కాంగ్రెసోళ్లకు కరెంట్ గురించి, వ్యవసాయం గురించి ఏం తెలవదని అర్థమవుతుంది. లేకపోతే కాంగ్రెస్ ఇస్తామన్నా మూడు గంటల కరంటు వ్యవసాయానికి ఏమన్న సరిపోతదా. ఆ కరంటుతో పంటలు పండించుకోలేం. గసొంటి కాంగ్రెసోల్లు మనకెందుకు. కేసీఆర్ సారు ముఖ్యమంత్రి అయినంక కరంటు బాధలు తీరాయి. 24 గంటల కరెంటు ఇస్తుండడంతో ఇప్పుడు మస్తు పంటలు పండించికుంటున్నం. రైతు రాజ్యం అంటే కేసీఆర్ పాలనలోనే సాధ్యమైంది. మాకు కేసీఆర్ సార్ కావాలి. కేసీఆర్ సారే రావాలి.

**-జే నాంపల్లి, రైతు, నర్మాల (గంభీరావుపేట)**

### గతంలో గొడవలు జరిగేవి



గతంలో పహాణీ అవసరమై తీసుకుంటే దానిలో అనుభవదారు కాలం ఉండేది. ఒకరి పేరుపై మరొకరికి పట్టా ఉండేది. అధికారుల చేయితడిపితే ఎవరి పేరుపైనైనా పట్టా మారేది. అసలు రైతుకు విషయం తెలిసి గొడవలయ్యేవి. ధరణి వచ్చాక పట్టా కాలం ఒకటే ఉండడంతో ఒకరి భూమిని ఇంకొకరికి మార్చేందుకు వీలు లేని విధానం వచ్చింది. ధరణిపై కొంతమందికి సరైన అవగాహన లేకపోవడంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు.

**- కాదాసు లక్ష్మణ్, రైతు (రుద్రంగి)**



### దళారుల రాజ్యంవస్తది

ధరణిని తీసేస్తే పాత పద్ధతి పట్వారీ వ్యవస్థ వస్తది. వాళ్లు వస్తే పైసలు తింటరు. కానీ పని చేయరు. భూమి రిజిస్ట్రేషన్ కావాలంటే దినాం ఆఫీసు చుట్టు తిరగాల్సి వస్తుంది. పనులన్నీ ఇడిచి పెట్టుకుని ఆఫీసుల చుట్టు తిరిగాలే. స్టాంప్ వేసే అటెండర్ నుంచి పెద్ద సార్ దాక డబ్బులు ఇచ్చుడు తప్పదు. ధరణి తీసెస్తే మళ్లా దళారుల రాజ్యం వస్తుంది. ఇప్పుడు ధరణితో పైసా ఖర్చు లేకుండా పట్టా అవుతున్నయి. రైతులను ఏనాడు పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇయ్యాల ఎన్నికలు వచ్చాయని డ్రామాలు ఆడుతుంది. దోపిడీ వ్యవస్థ తెచ్చేందుకే కాంగ్రెస్ నాటకాలు ఆడుతుంది. ప్రశాంతంగా ఉన్న రైతుల బతుకుల్లో నిప్పులు పోసేలా ఉంది. ఇక రైతులకు రందీ తప్ప ఏమీ మిగలదు. ధరణితో భూములకు రక్షణ ఉంది. ధరణి వద్దని రైతులకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతం.

**- వెన్ను బాలయ్య, రైతు, లింగన్నపేట (గంభీరావుపేట)**

### మళ్లీ ఆఫీసుల చుట్టూ తిరుగుడే..



రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణితోనే రైతులకు పక్కాగా రైతుబంధు వస్తున్నది. కాంగ్రెస్ వస్తే ధరణి , రైతుబంధు ఉండదు. మళ్లీ రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుడే. గతంలో భూములు పట్టాచేయించుకునేందుకు వీఆర్‌వో దగ్గరికి ఎన్ని రోజులు తిరిగినా పని కాకపోయేది. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణితో సులభమైన పద్ధతిలో స్లాట్ బుక్ చేసుకొని పది నిమిషాల్లో భూమి రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నరు. ఎన్నికల వేళ కాంగ్రెస్ నాయకులు వచ్చి మాయమాటలు చెబుతున్నరు.ఇకపై వారి ఆటలు సాగవు. మంచిగా పరిపాలించే కేసీఆర్ సార్ మళ్లీ రావాలి. ముఖ్యమంత్రిగా ఆయననే ఉండాలి. రైతులు సుఖంగా ఉంటున్నారు. ధరణితో భూసమస్యలు తగ్గినయ్.

**- మరిగడ్డ సతీశ్, రైతు (రుద్రంగి)**

# ధరణి పోతే అరిగోసే

## పాత వ్యవస్థతో పరేషానే

- మళ్లీ పైరవీలు, లంచాలు
- భూములకు భద్రత ఉండదు
- యజమానులు, కౌలుదారులకు గొడవలే
- కాంగ్రెస్ కుట్రలపై భగ్గుమంటున్న అన్నదాతలు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి తమ భూముల భద్రత కోసం తెచ్చిన ధరణిని తొలగిస్తామని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలపై జిల్లా రైతులు భగ్గుమంటున్నారు. ధరణిని బంగాళాఖాతంలో వేస్తామన్న ఆ పార్టీని, తామే బంగాళాఖాతంలో వేస్తామని తేల్చిచెబుతున్నారు. ధరణితో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, భూములకు భద్రత పెరిగిందని, నిమిషాల్లో రిజిస్ట్రేషన్లు అవుతున్నాయని చెబుతున్నారు. ఇది లేకుంటే ఇప్పుడు పెరిగిన భూముల ధరలను చూస్తే ఎన్ని మోసాలు, ఎన్ని గొడవలు జరిగేవోనని అంటున్నారు. ఒకప్పుడు తమ భూముల భద్రతపై అనేక అనుమానాలు ఉండేవని, ఇప్పుడు తమ భూములకు పూర్తి భద్రత ఏర్పడిందని చెబుతున్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ నాయకులు ఆగం చేస్తున్నారని మండిపడుతున్నారు. పటేల్, పట్వారీ వ్యవస్థలను నెలకొల్పి భూరికార్డులు తారుమారు చేసే సంస్కృతి ఆ పార్టీదని, ఇప్పుడు అదే వ్యవస్థను తెచ్చే ప్రయత్నం చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ఆ నాయకులను నమ్మితే మొదటికే మోసం వస్తుందని, మళ్లీ పాత వ్యవస్థతో అరిగోస తప్పదని హెచ్చరిస్తున్నారు. లంచం లేనిదే ఒక్క పనీ కాదని, లేదంటే నెలల కొద్దీ ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తుందని, పైసలిస్తే రికార్డులు మారుతాయని, కొత్త పేర్లు పుట్టకొస్తాయని నాటి రోజులను గుర్తు చేస్తున్నారు. పట్టా పాస్‌బుక్‌లో అనుభవదారు కాలం వస్తే గొడవలు మొదలవుతాయని, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ధరణి వ్యవస్థ కారణంగా ప్రతి పసలుకు రైతుబంధు కింద పెట్టుబడి సహాయం క్రమం తప్పకుండా సులువుగా పడుతున్నదని, ఇప్పుడు ఈ పద్ధతి మారిస్తే గతంలోలాగే అధికారులతో తిప్పలు తప్పవని వాపోతున్నారు. కాంగ్రెస్ అచ్చేది లేదు.. సచ్చేదు లేదు గానీ, పూటకోమాట చెబుతూ పరేషాన్ చేస్తున్నదని మండిపడుతున్నారు. ఆ పార్టీ అధికారంలోకి రాకుండానే అడ్డుకుంటామని, భూములకు రక్షణ కల్పించి,

### రేపుమాపంటూ తిప్పకున్నరు..



మాది వేణుగోపాల్‌పూర్. నాకున్న మూడెకరాల భూమి మా తాత పేరుమీదుండే. మా నాన్న పేరు మీదకు మార్చాలని పదేండ్ల కింద తహసీల్ ఆఫీసు, పట్వారీల చుట్టూ తిరిగినం. పైసలు ఖర్చుయితన్నరు. అయినా సరేనన్నం. రేపు మాపంటూ తిప్పుకున్నరు. మానాయన కాలంచేసిండు. పేరు మారలేదు. మా నాయనకే కాలేదు. ఇంకా నాకేం అయితదని అట్లనే సాగు చేసుకున్న. తెలంగాణ వచ్చినంక ధరణిలో దరఖాస్తు పెట్టుకోమని మా ఊరోళ్లు చెప్పిన్రు. ఏం పెట్టుకోవాలే ఎన్నిసార్లు తిరగాలని పని అయితలేదని వాళ్లతో అన్న. అది అప్పటి గవర్నమెంటు ముచ్చట.. ఇప్పుడు తెలంగాణ గవర్నమెంట్ల అద్ద గంటలనే పనైతాందని చెప్పంగనే దరఖాస్తు పెట్టుకున్న. సార్లు వచ్చి సూసిపోయింద్రు. మరుసటి రోజు ఆఫీసుకు రమ్మని ఫొటోలు తీసుకున్రు. నా పేరు మీద పట్టా, పాసుబుక్కు చేతిలో పెట్టిన్రు. చిల్లి గవ్వ ఖర్చుకాలేదు. ఎంత మంచి ధరణి పెట్టిన కేసీఆర్ సారుకు రుణపడి ఉంటం. యాభై కాంగ్రెస్ పాలన జూసినం. మళ్లీ వత్తే గదే పట్వారీలు వత్తరు. పైసలు, పైసలంటూ వసూలు జేత్తరు.

**- పాతూరి లచ్చిరెడ్డి, తంగళ్లపల్లి (రాజన్న సిరిసిల్ల)**

### కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తం

కాంగ్రెస్ ధరణిని తీసెస్తే భూములకు భద్రత ఉండదు. మళ్లీ పటేల్, పట్వారీ వ్యవస్థ తెస్తమంటున్నరు. గతంలో భూములను ఎవరు పైసలు ఇస్తే వాళ్లకు రాసేటోళ్లు. అది సరిచేసుకోవడానికి నెలల కొద్ది ఆఫీసుల చుట్టు తిరిగాల్సి వచ్చేది. ధరణి వచ్చినంక నేను నా ఎకరం భూమిని అమ్మి ఎవరికీ పైసలు ఇవ్వకుండా, దళారీ వ్యవస్థ లేకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్న. రిజిస్ట్రేషన్ అప్పుడు భయం కూడా కాలే. పకడ్బందీగా రిజిస్ట్రేషన్ జరిగింది. కానీ గతంలో రిజిస్ట్రేషన్ అయ్యేంత వరకు కూడా భయం ఉంటుండే. పట్వారీలు ఎప్పుడు ఏమంటరో అని భయం ఉండే. ధరణిని తీసేసి పాత పద్ధతి తెస్తే కబ్జాదారులు రాజ్యమేలుతరు. గతంలో పట్వారీలు పైసలకు ఆశపడి ఒకే భూమిని ఇద్దరి పేరు మీద చేసిన దాఖలాలు ఉన్నయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అంతా ఆన్‌లైన్‌లోనే ఉంటుంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే లంచాల రాజ్యం వస్తుంది. ప్రశాంతంగా ఉన్న రైతుల బతుకుల్లో నిప్పులు పోసేందుకు కాంగ్రెస్ ధరణిని తీసేస్తామంటుంది. ఇలా అక్రమాలకు చోటు ఇచ్చే కాంగ్రెస్‌కు ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతం.

**- శనిగరం ఆనందం, రైతు, తుర్కపల్లి (ముస్తాబాద్)**



### ధరణితో పది నిమిషాల్లో భూమి రిజిస్ట్రేషన్



సీఎం కేసీఆర్ రైతుల కోసం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. కార్యాలయాల్లో భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియ 10 నిమిషాల్లో పూర్తి అవుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ధరణి తీసేసి భూమాత పోర్టల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో అయోమయంగా ఉంది. కౌలుదారులు, అనుభవదారులు కాలం అంటూ రెవెన్యూ వ్యవస్థను మొదటికి తెస్తున్నారు. గతంలో రెండెకరాల భూమి పట్టా చేసుకునేందుకు రోజంతా వెచ్చించి 25 కిలో మీటర్ల దూరం వెళ్లి వేములవాడలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయలంలో భూమి రిజిస్ట్రేషన్ చేసుకునేటోళ్లం. అక్కడ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకొని డాక్యుమెంట్లు తీసుకువచ్చి తహసీల్ కార్యాలయంలో పేరు మీద రికార్డులో ఎక్కించుకోవడానికి నానా ఇబ్బందులు పడాల్సివచ్చింది. ధరణితో భూముల పట్టాలు చకచకా జరుగుతున్నయ్.

**-ఊరేవి రవి, రైతు (రుద్రంగి)**

### మళ్లీ భూ సమస్యలు వస్తయ్..



కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ధరణి తీసేసి భూమాత పోర్టల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో రైతులకు మళ్లీ భూ సమస్యలు వస్తయ్. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ ద్వారా ఎలాంటి అవినీతికి తావులేకుండా రైతులు తహసీల్ కార్యాలయాల్లో భూమి రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నరు. గతంలో భూములు పట్టా చేయించుకునేందుకు వీఆర్‌వో దగ్గరికి ఎన్ని రోజులు తిరిగినా పని కాకపోయేది. సీఎం కేసీఆర్ రెవెన్యూ వ్యవస్థలో వీఆర్‌వోలను తొలగించి ధరణి పోర్టల్ తీసుకువచ్చిన్రు. ఆన్‌లైన్ విధానంలో సులభమైన పద్ధతిలో స్లాట్ బుక్ చేసుకొని పది నిమిషాల్లో భూమి రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నరు. కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి రావడానికి రైతులకు మాయమాటలు చెబుతూ ధరణి స్థానంలో భూమాత పోర్టల్ ఏర్పాటు చేస్తామని, ఇందులో కౌలుదారు, అనుభవదారుల కాలం పెడుతామని చెబుతున్నరు. భూమాత పోర్టల్ ద్వారా ఒకరి భూమలు మరొకరికి రెవెన్యూ అధికారులు మార్చే అవకాశం ఉంటది. ఈ పోర్టల్ ద్వారా రైతుల భూ వివరాల తారుమారు కావడం, రైతులు నష్టపోవడం వంటి సమస్యలు ఎదురవుతయ్.

**-మాలోత్ రాందాస్, రుద్రంగి**